క్లుప్తంగా

కాణిపాకంలో పలువురు ప్రముఖులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని సోమవారం టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వామి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణకు చర్యలు



గుడిపాల: సర్వే చేస్తున్న మలేరియా సబ్‌యూనిట్ అధికారి శివసుబ్రమణ్యం

గుడిపాల: డెంగీ, మలేరియా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి శివసుబ్రమణ్యం అన్నారు. సోమవారం బట్టువాళ్లూరు గ్రామంలో లార్వా సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా ‘దోమలు పుట్టకూడదు–కుట్టకూడదు’ అనే నినాదంతో అక్కడ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. మురుగునీటి నిల్వలు, టైర్లు, కొబ్బరిచిప్పలు ఇంటి చుట్టుపక్కల ఉండకూడదన్నారు. డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా లాంటి జ్వరాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గ్రీవెన్స్ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్

బంగారుపాళెం: గ్రీవెన్స్ డేలో వచ్చిన భూసమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్‌డేలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. దారి, భూసమస్య, పట్టా పుస్తకాల్లో పేర్లు మార్పు, ఇళ్ల స్థలాలు మంజూరు, గ్రామాల్లో గ్రామకంఠం భూములు సర్వే చేయాలని పెద్దసంఖ్యలో ప్రజలు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. అధికారులు తమ పరిధిలో వచ్చిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

రేషన్ రవాణా కేసులో ఇద్దరి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ శ్రీనివాసులు

బంగారుపాళెం: రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో సోమవారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కేజీ సత్రం వద్ద ఈ నెల 20వ తేదీ లారీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ, పోలీస్ అధికారులు పట్టుకున్నారు. రూ 5.7 లక్షల విలువ చేసే 351 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి, తవణంపల్లె మండలం సరకల్లు గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్, తవణంపల్లెకు చెందిన ప్రదీప్‌కుమార్‌ను అరగొండ క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులను కోర్టుకు హాజరుపరచినట్లు తెలిపారు. ఏఎస్ఐ మల్లప్ప, హెడ్‌కానిస్టేబుల్ కిరణ్, కానిస్టేబుల్ నీరజాక్షులు పాల్గొన్నారు.

మున్సిపల్ గ్రీవెన్స్‌కు పలు ఫిర్యాదులు




వినతులు స్వీకరిస్తున్న సహాయ కమిషనర్ ప్రసాద్

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి పలు ఫిర్యాదులు అందాయి. సోమవారం సహాయ కమిషనర్ ప్రసాద్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి అందే ప్రతి వినతి, ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారించి త్వరగా పరిష్కరించాలని సహాయ కమిషనర్ ఆదేశించారు. ఆర్థిక అంశాలతో ముడిపడిన వాటిని ప్రాధాన్యత ఆధారంగా పూర్తి చేయాలన్నారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులు, వినతులను విచారించి వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, అసిస్టెంట్ సిటీప్లానర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ముమ్మందు అంతా స్మార్ట్ విద్యుత్..

- కేటగిరీ–2, షాపులు, ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు షురూ
- ప్రస్తుతం ఐరాల మండలంలో 190 మీటర్లు బిగించిన అధికారులు
- విడతల వారీగా పూర్తిస్థాయిలో అమర్చేందుకు సన్నద్ధం
- మీటర్‌కు ముందే రీచార్జ్ చేయాలి
- ముందస్తు చెల్లింపులపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పేదలు



వీఎస్ అగ్రహారంలో కేటగిరీ-2కు ఏర్పాటు చేసిన స్మార్ట్‌మీటర్

సాంకేతికత అన్నిరంగాల్లో విస్తరిస్తోంది. విద్యుత్ శాఖ మ్యాన్యువల్ మీటర్లకు స్వస్తి చెప్పనుంది. కేటగిరీ–2, దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలతో పాటు, గృహాలకు స్మార్ట్‌మీటర్లు (ప్రీపెయిడ్ మీటర్లు) ఏర్పాటు చేయనున్నారు. కొన్ని నెలల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం ప్రణాళికలు రూపొందించింది. అయితే వినియోగదారులు ముందుస్తుగా స్మార్ట్‌మీటర్లకు రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. విద్యుత్ అవసరాలకు ముందుగానే నగదు చెల్లించేలా నూతన విధానం అమల్లోకి రానుంది. ఈ ప్రక్రియపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఐరాల: స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. స్మార్ట్ మీటర్‌కు ముందే రీచార్జ్ చేయాల్సి ఉంటుంది. మండలంలో దాదాపు 18000 వేలకు పైగా వివిధ రకాల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. మండలానికి 600 స్మార్ట్‌మీటర్లు వచ్చినట్లు ఏఈ నీరజ చెప్పారు. ఇప్పటి వరకు 190 స్మార్ట్ మీటర్లను అమర్చినట్లు సమాచారం. అయితే ఈ మీటర్లకు ఎటువంటి సిమ్‌కార్డు అమర్చలేదు. దశల వారీగా వాటిని ప్రీపెయిడ్ మీటర్లుగా మార్చనున్నారు. కాకపోతే ముందుస్తు చెల్లింపులపై ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం ఈ నెల వినియోగించిన కరెంటు బిల్లు మరుసటి నెల చెల్లిస్తున్నాం. బిల్లు పొందిన 15 రోజుల వరకు అపరాధ రుసుం ఉండదు. మరో 15 రోజుల్లో బిల్లు చెల్లించడానికి సమయం ఉంటుంది. ప్రీపెయిడ్ విద్యుత్ మీటర్లు అమర్చితే ఈ పరిస్థితి ఉండదు. ముందుగానే నగదు చెల్లించి రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో కొంతమేర పేదలకు ఇబ్బందిగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

పేదలకే ఇబ్బంది..

కేంద్రప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు సంబంధించిన చర్యలను రాష్ట్రప్రభుత్వం ముమ్మరం చేసింది. త్వరలోనే అన్ని రకాల విద్యుత్ సర్వీసులకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు వ్యాపార సముదాయాలు, కేటగిరీ–2, ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ ప్రక్రియ ప్రారంభమైంది. వీలైనంత త్వరగా అన్ని రకాల విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు అమర్చాలనే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. అయితే కొందరు ఈ ప్రక్రియను వ్యతిరేకిస్తున్నారు. ఎందుకంటే విద్యుత్ వినియోగానికి ముందుస్తుగా రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. అంటే కరెంట్ చార్జ్ ముందుగానే చెల్లించాలన్న మాట. అంటే మన సెల్‌ఫోన్‌కు ఎలా రీచార్జ్ చేసుకుంటామో అదే విధానం అమలు కానుంది. విద్యుత్ మీటర్‌కు సంబంధించి రీచార్జ్ నగదు మేరకు సరఫరా కొనసాగనుంది. రీచార్జ్ అయిపోతే మళ్లీ చేయించుకోవాల్సిందే. దీంతో ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోందని ఆలోచిస్తున్నారు. పేదలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అవగాహన కల్పించాలి..



గ్రామాల్లో ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటర్లపై ప్రజలకు అవగాహన కల్పిస్తే మంచిది. ఆ దిశగా విద్యుత్ శాఖ అధికారులు ముందుకు సాగాలి. స్మార్ట్‌మీటర్ల వల్ల ఉపయోగాలను విద్యుత్ అధికారులు తెలియజేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రజలు ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటుతో ఆందోళన చెందుతున్నారు. –సురేంద్రయాదవ్, పెద్ద గొల్లపల్లె, ఐరాల

ఉన్న మీటర్లనే ఉంచాలి



ప్రభుత్వం స్పందించి మాలాంటి వారికి ఉన్న మీటర్లనే ఉంచాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఒకవేళ రాత్రి సమయంలో రీచార్జ్ అయిపోతే కరెంట్ కట్ అయిపోతుంది. నాకు రీచార్జ్ చేయడం కూడా తెలియదు. రాత్రంతా చీకటిలో ఉండాల్సిందేనా. గ్రామీణ ప్రాంతాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి.

–కోదండరెడ్డి, సీపీ పల్లె, ఐరాల

రీచార్జ్ అయిపోతే పరిస్థితి ఏంటి?



గ్రామీణ ప్రాంతాల్లో రీచార్జ్ అయిపోతే పరిస్థితి ఏంటి? అంధకారంలో ఉండాల్సిందేనా. రీచార్జ్ చేయాలంటే సెల్‌ఫోన్ షాపునకు వెళ్లాలి. అదే పట్టణంలో అలాంటి పరిస్థితి ఉండదు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ స్మార్ట్‌మీటర్లతో ఇబ్బందులు తప్పవు. పట్టణంలో ఉన్నవారికి ఇది మంచిదే. –కె.సుధాకర్‌రెడ్డి, సీపీ పల్లె, ఐరాల

నాణ్యమైన సరఫరా పొందవచ్చు

స్మార్ట్‌మీటర్ల ద్వారా వినియోగదారులు నాణ్యమైన విద్యుత్ సరఫరా పొందవచ్చు. అన్ని కార్యాలయాల్లో స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేస్తున్నాం. మండలంలో ఇప్పటి వరకు 190 మీటర్లు ఏర్పాటు చేశాం. కేటగిరీ–2 మీటర్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తాం. దశల వారీగా గృహాలు, వ్యాపార, పారిశ్రామిక సర్వీసులకు అమలు చేయనున్నాం. వీటి ద్వారా రీడింగ్ యూనిట్లను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. –నీరజ, ఏఈ, ఐరాల

వ్యాధులపై అప్రమత్తత అవసరం



గర్భిణులను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: శీతాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. సోమవారం మండలంలోని వేదగిరివారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 60 మంది రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో నీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య విద్యపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయంభు శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి మూలవర్లకు ఉదయం అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు. ఈ పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని దోష నివారణ చేసుకున్నారు. అనంతరం మొగిలీశ్వరస్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్ పోటీలకు మహారిషి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండలంలోని శేషాపురంలోని మహారిషి రాక్‌ఫోర్డు స్కూల్ విద్యార్థులు జాతీయ అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు చైర్మన్ విజయశంకర్ సోమవారం తెలిపారు. ఈ నెల 21న తిరుపతి ఎస్వీయూ క్రీడామైదానంలో జిల్లాస్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్ పోటీలు జరిగాయన్నారు. అండర్–16 బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన భానుప్రియ ద్వితీయ స్థానం, జ్వాల మూడోస్థానంలో నిలిచారన్నారు. అండర్–16 బాలుర విభాగంలో హేమేష్ మూడోస్థానం సాధించారన్నారు. ఉత్తమ ప్రతిభ చాటిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. 2025 జనవరి 5న జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. విద్యార్థులను హెచ్ఎం గోవిందస్వామి, ఇన్‌చార్జ్ మౌనిక, పీఈటీ అజయ్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

అంటువ్యాధుల నియంత్రణపై అవగాహన



మహిళలకు వైద్యం చేస్తున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె: అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. సోమవారం మండలంలో మాధవరంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అదే విధంగా గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. అపరిశుభ్రత వల్లే రోగాలు వస్తాయని, వీధులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నేడు గాజులపల్లెలో రెవెన్యూ సదస్సు

తవణంపల్లె: మండలంలోని గాజులపల్లెలో మంగళవారం ఉదయం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామని మండల భూరీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు కట్టకింద పల్లెలో రెవెన్యూ సదస్సు జరుగుతుందని వివరించారు. రైతులు భూసమస్యలపై రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకుని రావాలన్నారు. రైతులు, ప్రజలు రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు.

ఓంశక్తి అమ్మవారికి పూజలు



ఓంశక్తి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



అన్నదానం చేస్తున్న ఓంశక్తి భక్తులు

తవణంపల్లె: మండల కేంద్రమైన తవణంపల్లె ధర్మరాజుల గుడిలో ఓంశక్తి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అమ్మవారి చిత్రపటాన్ని ప్రతిష్ఠించి దీక్షలో ఉన్న మాలధారులు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. అలాగే భజనలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం ఓంశక్తి భక్తుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

గణితం.. నేర్చుకుంటే సులభం



సీఐ నిత్యబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రిన్సిపల్ రేఖ

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు భయపడకుండా గణితం నేర్చుకోవాలని ట్రాఫిక్ సీఐ నిత్యబాబు అన్నారు. సోమవారం నగరంలోని రామ్‌నగర్ కాలనీలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో గణిత దినోత్సవం నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. భయాన్ని పోగొట్టుకుంటే గణితం నేర్చుకోవడం చాలా సులభతరం అన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే ట్రాఫిక్ రూల్స్‌ను తెలుసుకోవాలన్నారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని విద్యార్థులు తెలియజేయాలని చెప్పారు. డ్రైవింగ్ చేసే సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడకూడదని తెలియజేశారు. కార్యక్రమంలో పీసీఆర్ కళాశాల గణిత లెక్చరర్ విజయబాబు, ఏజీఎం సురేష్, ప్రిన్సిపల్ రేఖా తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతిగృహం తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ధనలక్ష్మి

ఐరాల: ప్రభుత్వ వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిచడంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ ధనలక్ష్మి సూచించారు. సోమవారం స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్‌ను ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం గురించి ఆరా తీశారు. వంట గది, కూరగాయలు, సరుకులు ఉన్న స్టోర్ గదిని తనిఖీ చేశారు. విద్యార్థులకు తాజా కూరగాయలు, ఆకుకూరలతో రుచికరమైన భోజనం వడ్డించాలన్నారు. అనంతరం ఆమె విద్యార్థులతో మాట్లాడారు. నాణ్యమైన భోజనం అందిస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, పరిసరాలతో పాటు మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు. అలాగే స్థానిక పీహెచ్‌సీని ఆమె సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవల వివరాలను డాక్టర్ పూర్ణలతను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధలు చెప్పాం.. దయ చూపండి మీరే..

- పలు సమస్యలపై అర్జీలు ఇచ్చిన బాధితులు
- వినతులు స్వీకరించిన జాయింట్ కలెక్టర్ విద్యాధరి



వృద్ధురాలి సమస్యను వింటున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్: అయ్యా వినతులు ఇస్తున్నాం.. పరిష్కారం చూపండి అంటూ పలువురు ప్రజలు అధికారులను వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు ప్రజలు తమ ఆవేదన ఇలా విన్నవించుకున్నారు.

వితంతు పింఛన్ ఇవ్వండి సారూ..

నాది ఎస్ఆర్ పురం మండలం 49 కొత్తపల్లి మిట్ట గ్రామం. నా భర్త అకస్మాత్తుగా మృతి చెందాడు. ప్రభుత్వం అందించే వితంతు పింఛన్ కోసం మండల అధికారుల వద్దకు వెళ్లి అడిగితే ఎలాంటి సమాధానం చెప్పడం లేదు. అందువల్లే కలెక్టర్ కార్యాలయానికి రావాల్సి వచ్చింది. వితంతు పింఛన్ మంజూరు చేసి న్యాయం చేయండి.

–సుజాత, అర్జీదారురాలు, ఎస్ఆర్ పురం మండలం

అగ్రవర్ణాల వారు కబ్జా చేస్తున్నారు



తమ భూమిని అగ్రకులస్తులు కబ్జా చేస్తున్నారని చౌడేపల్లె మండలం దిగువపల్లె పంచాయతీ మోట్లపల్లె యానాది కాలనీ వాసులు తెలిపారు. ఈ మేరకు ఆ కాలనీకి చెందిన వెంకటలక్ష్మి, రామకృష్ణ మాట్లాడుతూ 20 ఏళ్ల కిందట 3 ఎకరాల 40 సెంట్లు ప్రభుత్వ భూమిని భూ పంపిణీలో అందజేశారన్నారు. ఆ భూమికి ప్రభుత్వం పట్టాలు సైతం అందజేసినట్లు తెలిపారు. అయితే మూడు రోజుల క్రితం అగ్ర కులస్తులు వచ్చి తమ భూమిని కబ్జా చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఆ భూమిలో తాము బోరు వేసుకుని మామిడి చెట్లు పెట్టుకుని వ్యవసాయం చేసుకుంటున్నట్లు చెప్పారు. పోలీసులను పంపి బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని కోరారు.

మూడు చక్రాల స్కూటర్ ఇప్పించండి



నేను చిత్తూరు నగరంలో నివాసం ఉంటాను. మూడు చక్రాల స్కూటర్ కోసం చాలాసార్లు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాను. నడవలేని స్థితిలో ఉన్న నాకు ఎలాంటి ఆధారం లేదు. విభిన్న ప్రతిభావంతుల శాఖ వద్దకు వెళ్లి అడిగితే సమాధానమే చెప్పరు. నా వినతిని పరిశీలించి మూడు చక్రాల స్కూటర్‌ను మంజూరు చేయండి.

–అసగిరి, దివ్యాంగుడు, చిత్తూరు

నష్టపరిహారం ఇప్పించండి



నాది పెనుమూరు మండలం గుడ్యానంపల్లి హరిజనవాడ. గత నెలలో కురిసిన వర్షాలకు భారీ వృక్షం ఇంటిపై పడడంతో ఇళ్లు పూర్తిగా దెబ్బతింది. ప్రస్తుతం అద్దె ఇంట్లో ఉంటున్నాం. మా పరిస్థితిని మండల అధికారులకు తెలియజేశాను. చాలా రోజులుగా స్పందన లేకపోయే సరికి ఇప్పుడు కలెక్టర్ సారును కలిశాను. ప్రభుత్వం తరఫున నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

–చంద్రశేఖర్, అర్జీదారుడు, పెనుమూరు మండలం

దారి లేకుండా చేస్తున్నారు



నేను వి.కోట మండలం కుంబార్లపల్లి నుంచి వచ్చాను. నా తండ్రి శ్రీరామప్ప పేరిట మా గ్రామంలో సర్వే నంబర్ 82/3బిలో 1.5 ఎకరాల భూమి ఉంది. ఆ భూమికి ఆనుకుని ఉన్న రస్తా పోరంబోకు స్థలంలో ఒక వ్యక్తి అక్రమంగా కంచె వేయడమే కాకుండా నా స్థలానికి వెళ్లేందుకు దారి లేకుండా ఇబ్బందులు సృష్టించి బెదిరిస్తున్నాడు. అధికారులు పరిశీలించి న్యాయం చేయండి.

–సుబ్రహ్మణ్యం, అర్జీదారుడు, వి.కోట మండలం

అన్నదాతలపై దమనకాండ అన్యాయం



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: దేశానికి వెన్నెముక లాంటి అన్నదాతలపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దమనకాండ అన్యాయమని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం దమనకాండ నిర్వహించడం దుర్మార్గమన్నారు. ఢిల్లీ సరిహద్దుల్లో అరెస్టు చేసిన రైతులను బేషరతుగా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యవర్గ సభ్యులు జనార్దన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు ఉద్యమానికి తలొగ్గి గతంలో రైతాంగ వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చే సిందన్నారు. ప్రస్తుతం వాటిని మరో రూపంలో తీసుకొచ్చేందుకు ప్రయత్నించడం అన్యాయమన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి మునిరత్నం నాయుడు మాట్లాడుతూ నూతన వ్యవసాయ చట్టాలు, గత చట్టాలకు మసి బూసి మారేడు కాయ చేసిన చందంగా మారిందని ఎద్దేవా చేశారు. ఆ చట్టాల వల్ల రైతులకు ఎలాంటి మేలు జరగకపోగా కార్పొరేట్ వ్యవస్థలకు అనుకూలంగా ఉందన్నారు. రైతులకు ఆ చట్టాలు తీవ్రంగా నష్టం జరిగేలా చేస్తాయని మండిపడ్డారు. ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.నాగరాజు మాట్లాడుతూ కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు ఉత్పత్తి వ్యయానికి అదనంగా 50 శాతం కలిపి గిట్టుబాటుధరను కల్పించాలని డిమాండ్ చేశారు. గిట్టుబాటు ధర కల్పిస్తే రైతులకు కనీస మద్దతు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలన్నారు. నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయకపోతే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. నూతన సహకార చట్టాన్ని, విద్యుత్ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీకి వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో నాయకులు ఉమాపతి నాయుడు, విసి గోపినాథ్, మణి, దాసరి చంద్ర, విజయ్ గౌరి, రమాదేవి జమిలబి, కుమారి వి దామోదరం, మనోజ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభానికి ప్రాణప్రతిష్ఠ



శివాలయంలో ధ్వజస్తంభానికి ప్రాణప్రతిష్ఠ చేస్తున్న వేద పండితులు

పుంగనూరు: పట్టణంలోని శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన ధ్వజస్తంభానికి సోమవారం ప్రాణప్రతిష్ఠ చేశారు. ఆలయ అర్చకులు బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో ధ్వజస్తంభాన్ని శుద్ధి చేసి, గణపతి, స్వస్తివాచన, కలశ స్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మహోత్సవాలు ఈనెల 25 వరకు నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.